కర్నూలు | నంద్యాల
వార్త
18 మార్చి 2026 బుధవారం పేజీలు 4

## ఇల్లూరుకొత్తపేటలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు



**బనగానపల్లె, మార్చి 17,ప్రభాతవార్త :** మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి జడ్పీ హైస్కూల్ మరియు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన మంత్రి, అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఆహార నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచిపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న ల్యాబ్‌లను పరిశీలించిన మంత్రి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాల ప్రాంగణం, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం కోసం వంటశాల (కిచెన్ షెడ్) అవసరాన్ని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకురాగా, తన సొంత నిధులతో వంటశాల ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరగా, త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన మంత్రి, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, సచివాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, నాణ్యమైన సేవలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీల ద్వారా ప్రభుత్వ సేవల అమలు విధానంపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.



# పండుగకు వచ్చి.. పరలోకాలకు..!

**- రెండు కుటుంబాలలో అలుముకున్న విషాదం**
**- లారీ,ద్విచక్రవాహనం ఢీ ఇద్దరు యువకులు మృతి**



**గోనెగండ్ల, మార్చి, 17,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లలో లారీ, ద్విచక్రవాహనం ఢీ కొన్న ప్రమాదంలో బోయ మునిస్వామి(31),మొండి వీరేష్(17) ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు,మృతుల బంధువులు అందించిన సమాచారం మేరకు బోయ మునిస్వామికి తల్లి మద్దమ్మ,భార్య సిమ్రాన్ ఇద్దరు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు. అలాగే మొండి వీరేష్‌కు తల్లి అచ్చమ్మ,ఉన్నారు. ఈ రెండు కుటుంబాలది కూలీ పనుల చేసి జీవనం సాగించే వారు. అయితే బోయ మునిస్వామి,మొండి వీరేష్‌లు చిన్నప్పటి నుంచి ఇద్దరు మంచి స్నేహితులు స్వంత గ్రామంలో పనులు లేక పోవడంతో జీవనం కష్టంగా మారింది. దీంతో ఈ రెండు కుటుంబాల సభ్యులు తెలంగాణా రాష్ట్రం,నాగర్ కర్నూలులోని ఇప్పలపల్లి గ్రామంకు గత రెండు నెలల క్రితం బ్రతుకు తెరువు కోసం వలస వెళ్లారు. అయితే అక్కడ పనులు చేసుకొని కొంత కూడా బెటుకున్నారు. ఉగాది పండుగకు స్వంత గ్రామం చేరాలని తలచి కుటుంబ సభ్యులతో మంగళవారం తెల్లవారు జమున 5 గంటలకు ఇప్పలపల్లె నుంచి గోనెగండ్లకు చేరారు. ఉదయం 10.45గంటలకు ఇద్దరు స్నేహితులు మునిస్వామి,మొండి వీరేష్‌లు గంజహళ్లి క్రాస్‌రోడ్డు దగ్గరకు తమ ద్విచక్రవాహనంలో వచ్చారు. అక్కడ స్వంత పని ముగించుకొని బస్టాండ్ దగ్గరకు ఇద్దరు ద్విచక్రవాహనం(ఏపీ 39,జె క్యూ 6383)పై వెలుతుండగా ఎమ్మిగనూరు వైపు నుంచి (ఏపీ 21 వై 6667) అనే లారీ వేగంగా అజాగ్రత్తగా వచ్చి వెనుక వైపు నుంచి ఢీ కొన్నది. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న బోయ మునిస్వామి,మొండి వీరేష్‌లు ద్విచక్రవాహనంతో పాటు లారీ చక్రాల కింద పడ్డారు. మునిస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు,వీరేష్‌ను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ వీరేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రబాబు తెలిపారు. స్వంత గ్రామానికి చేరుకున్న కొన్ని గంటల లోపే ఇద్దరు స్నేహితులు మృత్యు వాత



పడటంతో గ్రామంలో విషాదం అలము కుంది. ఎక్కడ వెళ్లిన ఇద్దరు కలిసి వెళ్లేవారు కలిసి బతుకు తెరువు కోసం ఒకే గ్రామానికి వెళ్లారు. ఒకే రోజు గోనెగండ్లకు చేరి ఒకే వాహనంలో ప్రయాణించి మృతువడిలో కూడా ఇద్దరు వీడలేదని అంటు కుటుంబసభ్యులు బంధువులు స్నేహితులు రోధనలు చూపరులకు కంటతడిపెట్టిస్తున్నాయి.



# కైలాస వాహనంపై.. స్వామి అమ్మవార్లు..!






**శ్రీశైలం ప్రాజెక్టు మార్చి 17, ప్రభాతవార్త :** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో ఉగాది మహోత్సవముల వైభవపేతంగా జరుగుతున్నాయి. శ్రీశైలం మల్లన్న దర్శించుకునేందుకు కర్ణాటక,మహారాష్ట్రల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీశైలం కు చేరుకుంటున్నారు. నల్లమల అటవీ మార్గము గుండా పాదయాత్రతో తండోపతండాలుగా తరలివస్తున్నారు. రెండవరోజైన మంగళవారం నాడు శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేకపూజలు జరిపించబడ్డాయి. ఆ తరువాత ఉదయం గం. 8.00 నుండి స్వామివారి యాగశాలలో చండీశ్వరపూజ, మండపారాధనలు, లోక కల్యాణం కోసం జపానుష్ఠానాలు రుద్రహోమం నిర్వహించబడ్డాయి. అదేవిధంగా అమ్మవారి యాగశాలలో చండీహోమం జరిపించబడ్డాయి. ఉత్సవములో భాగంగా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు చేయడం జరిగింది. కాగా సాయంత్రం 5.30గంటలకు సాయంకాల పూజలు,జపానుష్ఠానములు జరిపించబడ్డాయి. కైలాసవాహనంపై శ్రీ స్వామివార్లు. ఈఉత్సవాలలో భాగంగానే సాయం కాలం శ్రీస్వామిఅమ్మవార్లకు కైలాసవాహనసేవ జరిపారు. ఈ సేవలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాసవాహనసేవపై వేంచేబు చేయించి విశేషపూజాదికాలు జరిపించారు. తరువాత గ్రామోత్సవం నిర్వహించబడింది. కైలాసవాహనంపై అధిరోహించిన స్వామి అమ్మవార్లను దర్శించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని, సకలశుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది.

**మహాదుర్గ అలంకారం లో అమ్మవారు:**

ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తికి మహాదుర్గ అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చింది. అనంతరం ఆలయ మాడ వీధులలో గ్రామోత్సవం జరిపారు. అష్టభుజాలు గల ఈ దేవి శంఖం,చక్రం, గద, పద్మం, త్రిశూలం, ఖడ్గం మొదలైన వాటిని ధరించి దర్శనం ఇచ్చింది. అదే విధంగా గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంభాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్రడోలు కుణిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం తదితర కళారూపాలను ఏర్పాటు చేశారు. గ్రామోత్సవము లో శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు దంపతులు అధికారులు,అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.



## ధాతృత్వమే పరమావధిగా..
## మానవసేవయే.. మాధవ సేవగా..!

**: గోళ్ళ రాజేష్..గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో 1000 మందికి ఉగాది,రంజాన్ పండుగ సరుకులు**





**నంద్యాల మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి :** నంద్యాల పట్టణంలోని ప్రజలకు గోళ్ళ రాజేష్ తన ధాతృత్వం చాటుకుంటున్నారు. మానవ సేవయే మాధవ సేవగా ముందుకెళ్తున్నారు నంద్యాల వాసి ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్. నంద్యాల నియోజకవర్గంలో గోళ్ళ రాజేష్ వ్యాపార నిమిత్తం స్థానికంగా అందుబాటులో లేనప్పటికీ కూడా నంద్యాల నియోజకవర్గ ప్రజలపై ఉన్న ప్రేమ , అభిమానాలతో గడిచిన నాలుగు నెలల పైగా కుల, మతాలకతీతంగా పేదల పెద్దన్నగా తనకు ఆర్థికంగా లక్షల రూపాయల ఖర్చు అవుతున్నప్పటికి ఎన్నో రకాలుగా తన వంతు సహాయ, సహకారాలు, ఆర్థిక సహకారాలు అందిస్తూ ముందుకెళుతున్నారు గోళ్ళ రాజేష్. అందులో భాగంగా ఈరోజు హిందూ సోదర,సోదరీమణులకు ఉగాది పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరు సుఖ, సంతోషాలతో ఆనందాలతో కుటుంబ సభ్యులతో పండుగలు నిర్వహించుకోవాలని సదుద్దేశంతో ఈరోజు 1000 మంది కుటుంబాలకు పైగా ఉగాది పండుగ సరుకులు, రంజాన్ పండుగ సరుకుల కిట్ల పంపిణీ గోళ్ళ రాజేష్ కార్యనిర్వాహకులు సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కార్య నిర్వాహకులు సీనియర్ రిపోర్టర్ నూర్ బాషా మాట్లాడుతూ పేదవారికి ఆత్మీయుడుగా ఇప్పటికే గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గంలో ఎన్నో రకాలుగా వివిధ రూపాలలో వేలాదిమందికి సహాయ, సహకారాలు ఆర్థిక సహకారాలతో పాటు పేదలందరికీ తోడబుట్టినవాడుగా గోళ్ళ రాజేష్ తన వంతు సహకారాలు అందిస్తూ ఉన్నారు. తనకు ఆర్థికంగా ఎంత భారం ఉన్నప్పటికీ కూడా వాటిని లెక్కచేయకుండా కేవలం పేదలకు సాయం చేయాలంటే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారు గోళ్ళ రాజేష్ అని తెలిపారు. భవిష్యత్తులో గోళ్ళ రాజేష్ నంద్యాల నియోజకవర్గ ప్రజలకు ఇంకా ఎన్నో మెరుగైన సేవాసహాయ,సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని నియోజవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ను భగవంతుడు ఎల్లప్పుడూ చల్లగా చూసి ఆశీర్వదించాలని ఎందుకంటే ఇలాంటి సేవ తత్పరత ఉన్నటువంటి వారిని భగవంతుడు చల్లగా చూస్తే ఇలాంటి వారు భవిష్యత్తులో ప్రజలకు ఇంకా ఎన్నో సేవాసహాయ,సహకారాలు అందించేందుకు ముందుంటారని నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ని అతని మంచి మనసును ఆశీర్వదించి భగవంతున్ని ప్రార్థించాలని వారు తెలిపారు.

## సొంత పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన సెగ..

**కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మకు.. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తాం...!**

**ఆదోని క్రైమ్, మార్చి 17 ప్రభాతవార్త :** ఆదోని మండలం ధనాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ధనాపురం గ్రామానికి టిడిపి జిల్లా అధ్యక్షురాలు పార్టీ ముఖ్య నేతలు వెళ్లడం జరిగింది స్థానికంగా ఉన్నటువంటి టిడిపి నాయకులు కార్యకర్తలు ఒక్కసారిగా వారి యొక్క ఆవేదన వ్యక్తం చేశారు పార్టీ కోసం కష్టపడి పార్టీని గెలిపించుకున్నాం కానీ ఇక్కడ మాకు న్యాయం జరగడం లేదు స్కూల్ కాంట్రాక్టులు, రోడ్డు కాంట్రాక్టులు, స్టోర్ రేషన్ షాప్ మొత్తం బిజెపి నాయకులే చేస్తున్నారు మేము ఎలక్షన్లకు ముందు కేసులు పెట్టించుకుని ఉన్నాం మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి ఓటు వేయమని



అడగకుండా ఉన్న నాయకులకు కూడా పదవులు ఇచ్చారు మా సమస్యలు పరిష్కరించకపోతే? తెలుగుదేశం పార్టీకి ముక్త గంటతో రాజీనామా చేస్తామని ధనాపురం గ్రామం టిడిపి నాయకులు మల్లికార్జున మాజీ సర్పంచ్ , షేక్ అన్న , శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. తెలిపినప్పటికీ అంతర్గత విభేదాలు ఉండడం నాకు కూడా తెలుసు కాబట్టి పెద్దల సమక్షంలో కూర్చోబెట్టి మాట్లాడతా అంటూ జిల్లా అధ్యక్షురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మంత్రి బీసీ

**కొలిమిగుండ్ల, మార్చి 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన చదువుల రామనాథ్‌రెడ్డి అనే లబ్దిదారునికి సిఎం రిలీఫ్ ఫండ్ రూ.46 వేల చెక్కును రోడ్ల భవనాలశాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, ఇటిక్యాల గ్రామ టీడీపీ నాయకుడు తోట శివారెడ్డి కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారునికి అందజేశారు. అనంతరం వైద్యసహాయం పొందిన రోగుల ఆరోగ్యపరిస్థితిని వారి యోగ క్షేమాలను మంత్రి బీసీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ చేయించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.



## మోసం..మోసం..
# మరో.. ఘరానా మోసం..!

**: మరో ఆగ్రిగోల్డ్ శ్రేయ ఇన్రాఫ వేల కోట్లు మోసం**
**: మూలాలు బి.జె.పి పాలిత యు.పి.లో**

దేశ వ్యాప్తంగా అమాయక ప్రజలను ఆసరాగ చేసుకుని చేస్తున్న మోసాలు అన్ని ఇన్ని కావు. నిరంతరం జరుగుతున్న మోసాలకు అద్దు ఆదువు లేకుండా పోతున్నాయి. మోసగిస్తున్న సంస్థలను, వ్యక్తులను శిక్షిస్తున్న దాఖలాలు లేవు. ప్రజలను మోసగిస్తున్న సంస్థలను, వ్యక్తులను శిక్షించిన, శిక్షిస్తున్న దాఖలాలు ప్రభుత్వాలు వద్ద సాక్షాలు లేవు. అగ్రిగోల్డ్ సంస్థ తెలుగు రాష్ట్రాల ప్రజలనే కాక దేశ వ్యాప్తంగా ఎంతో మందిని ముంచేసి వేలాది కోట్ల రూపాయలు దోచేసింది. దాదాపు 25 ఏళ్లు అవుతున్నా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వాలు వస్తున్నాయి,పోతున్నాయి. అయితే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగటంలేదు.ఇప్పటికీ తమకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాదితులు ఆందోళన చేయటం బాధకరం. ఈలోగా మరో ఆర్థిక నేరగాళ్ళ మోసం వెలుగులోకి రావటం ఆంథోళన కలిగిస్తోంది. ఆ మోసానికి మూలాలు బి.జె.పి పాలిత ఉత్తర్ ప్రదేశ్ ఉండటం గమనార్హం. వివరాల్లోకి వెళితే..

2లో




**కర్నూలు మార్చి 17 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తర ప్రదేశ్లోని శ్రేయా ఇన్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఖ అనే సంస్థఆ ప్రజలకు ఆశచూపి ఆర్థిక దోపిడికి పాల్పడింది. పెట్టుబడికి రెండింతలు ఇస్తామని అత్యాశ చూపారు నమ్మబలికారు నమ్మిన అమాయకులు వేలు, లక్షలు ఆ సంస్థలో ఇన్వెస్ట్ చేశారు. ఎన్నో కష్ట నష్టాలకోర్చి శ్రమించి పోగు...

## లోకాయుక్త జోక్యంతో ఉద్యోగులకు బకాయిల చెల్లింపు

**: ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలుగా రూ.54.24 లక్షలు జ మ**
**: 32 కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల సిబ్బందికి లాభం**
**: రెండు ఏజెన్సీలపై క్రిమినల్ కేసులు నమోదు**

**కర్నూలు, మార్చి 17, ప్రభాతవార్త :** లోకాయుక్త సంస్థ జోక్యంతో శ్రీకాకుళం జిల్లాలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎగవేతకు గురైన ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు రూ.54.24 లక్షలు వారి వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయించబడింది. సోంపేటకు చెందిన పొండూరు బాలరాజు ఫిర్యాదు నెం.182/2020/బి2 ఆధారంగా లోకాయుక్త సంస్థ విచారణ చేపట్టింది. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో పనిచేసే వంటమనుషులు, వాచ్మెన్లు, అటెండర్లు, అకౌంటెంట్లు తదితర ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జూన్ 2018 నుండి జనవరి 2020 వరకు వేతనాల నుంచి ఈపీఎఫ్, ఈఎస్ఐ పేరుతో కోతలు విధించినప్పటికీ, ఆ మొత్తాలు వారి ఖాతాల్లో జమ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు విశాఖపట్నం ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖ అధికారులు మరియు సమగ్ర శిక్ష అధికారులు విచారణ జరిపి నివేదికలు సమర్పించారు. శ్రీకాకుళం జిల్లాలోని 32 కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో పనిచేసే సిబ్బందికి చెల్లించాల్సిన సుమారు రూ.50.24 లక్షల ఈపీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను ఫోర్ వ్యూ సెక్యూరిటీ అండ్ హెచ్.ఆర్. సర్వీసెస్, శ్రీకాకుళం మరియు స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీసెస్, భీమవరం సంస్థలు ఎగవేసినట్లు విచారణలో తేలింది. దీనిపై లోకాయుక్త పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ మరియు సమగ్ర శిక్ష అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సంబంధిత ఏజెన్సీలపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అనంతరం మొత్తం రూ.52,24,006/ బకాయిలను సిబ్బంది ఖాతాల్లో జమ చేయించారు. ఈ అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చిన ఫిర్యాదుదారుని ఉప లోకాయుక్త పి.రజని అభినందించారు. అలాగే బకాయిల చెల్లింపుతో పాటు ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నందుకు సంబంధిత అధికారులను ప్రశంసించారు. ఉద్యోగులకు జరిగిన ఆర్థిక నష్టం సరిచేయబడిన నేపథ్యంలో ఈ ఫిర్యాదును ముగించినట్లు ఉప లోకాయుక్త ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆస్తిపన్ను బకాయిలపై.. వడ్డీ రాయితీ

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు మున్సిపల్, మార్చి 17, ప్రభాతవార్త:** ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీపై 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నం.58 ప్రకారం ఈనెలాఖరులోపు ఏక మొత్తంలో బకాయిలను చెల్లించిన పన్నుదారులకు వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే చెల్లించిన పన్నుదారులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో సర్దుబాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. మంగళవారం రెవిన్యూ విభాగ అధికారులు, అడ్మిన్ కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కమిషనర్ మాట్లాడుతూ పన్నువసూళ్ళను వేగవంతం చేయడానికి ఇది మంచి అవకాశమని బకాయిదారులు తప్పకుండా వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బ్యానర్లు, ఆటో మైక్ ప్రకటనలు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఆర్వోలు జునైద్, వాజిద్, స్వర్ణలత, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

## బయటపడుతున్న సంగమేశ్వర గర్భాలయం

**కొత్తపల్లి, మార్చి 17, ప్రభాతవార్త:** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర గర్భాలయం నదిజలాల నుండి బయటపడుతుంది. శ్రీశైలం జలాశ నీటిమట్టం 842 అడుగులకు చేరడంతో ఆలయ ప్రహారిభాగం కిందివరకు తగ్గింది. దీంతో ఆలయ ముఖద్వారం బయటపడింది. మరో నాలుగు అడుగులు నీరు తగ్గితే ఆలయం పూర్తిగా బయటపడుతుందని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ తెలిపారు. త్వరలో ఆలయంలోని వేపదారు శివలింగం దర్శన భాగ్యం లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



# కూటమి అంటేనే కల్తీ అంటూ నేతల ధ్వజం

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధిః** కూటమి అంటేనే కల్తీ.. లడ్డూకల్తీ అని నిరూపించ లేకపోయారని వీరి పాలనలో నైతికత పూర్తి కల్తీ అయిపోయిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ నేతల తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం బొమ్మలసత్రం వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించిన అనంతరం కూటమి నేతల అచాచకాలను ఎండగడుతూ భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు చైర్మన్ బి ఆర్ నాయుడు



తన పదవికి కలంకం తెచ్చారని వైసీపీ నేతలు మండిపడ్డారు. పవిత్రమైన పదవిలో ఉంటూ ఆయనకు సంబంధించిన రాసలీలు, వీడియోలు బహిర్గతం కావడం సిగ్గుచేటని విమర్శించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో ఉన్నారని ఇటువంటి వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా ఉండడం దురదృష్టకరమన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడుతూ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ టీటీడీ చైర్మన్ వ్యవహారంపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై దాడులకు, వేదింపులకు దిగుతున్నారని విమర్శించారు. ఈకార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కారు రవికుమార్, కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు సుబ్బరాయుడు, అసెంబ్లీ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, వైసీపీ నాయకులు ఎర్రన్న, సాయిరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాలెపాటి ఆంజనేయులు, తిమ్మరాజు పాల్గొన్నారు.

## హెబ్బటం నుండి కురుకుంద గ్రామానికి పైపులైన్ మంజూరు చేయాలని వినతి



**ఆలూరు,మార్చి 17,ప్రబాతవార్త:** మండలంలోని హెబ్బటం నుండి కురుకుంద గ్రామానికి త్రాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయడానికి రూ.59 లక్షల గ్రాంట్ మంజూరు చేయాలని కోరుతు ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బూషినే విరుపాక్షి జిల్లా కలెక్టర్ డాక్టర్. సిరి కి ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. మంగళవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున హెబ్బటం నుండి కురుకుంద వరకు పైపులైన్ ఏర్పాటు చేస్తే ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లబిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రబుత్వం వెంటనే నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

## పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలి



**పత్తికొండ,మార్చి 17,ప్రబాతవార్త:** పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పెంచి వంట గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతు సిపిఐ ఆధ్వర్యంలో స్తానిక నాలుగు స్థంబాల మండపం వద్ద పట్టణ కార్యదర్శి అద్యక్షతన ధర్నా నిర్వహించారు. ఆయన మాటాల్డఉతు ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేవాలు చేస్తున్న యుద్దం వలన సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ దేశాలలో జరుగుతున్న యుద్దం వలన ఉద్యానవన పంటల ఎగుమతి దిగుమతులు ఆగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలపై పెనుబారం పడుతొందన్నారు. తక్షణమే ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న యుద్దాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నబిరసూల్, మండల కార్యదర్శి యు.కారుమంచి, నాయకులు గురుదాస్, గిద్దయ్యగౌడ్, నెట్టికంతయ్య, మండల సహయ కార్యదర్శి జొహారాపురం కాశీ, పాల్గొన్నారు.

## శ్రీశైలం తొగటవీరక్షత్రియ సంఘం (సత్రం) తాత్కాలిక కమిటీ చెల్లదు



**నందికొట్కూరు,మార్చి 17,ప్రబాతవార్త:** శ్రీశైలం శ్రీ తొగటవీర క్షత్రియ సంఘం (సత్రం) నూతనంగా ఏర్పాటు అయిన తాత్కాలిక కమిటీకి అసలు గుర్తింపేలేదని సొంతంగా కమిటీ ప్రక టించుకోవడం తగదని నందికొట్కూరు శ్రీతొగట వీరక్షత్రియ సంఘం గౌరవ అద్యక్షుడు బలుపాల సత్యనారాయణ, అధ్యక్షుడు వీరనాల ప్రసాద్, సెక్రటరీ చట్టా మురళీ తెలిపారు. మంగళవారం స్తానిక అమ్మవారి ఆలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు త్వరలో శ్రీశైలం తొగటవీర క్షత్రియ సంఘం (సత్రం) ఎన్నికలు పాత కమిటీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఇటీవలే జిల్లా కమిటీ సమావేవం కూడాజరిగిందులో శ్రీశైలం తొగటవీర క్షత్రియ సత్రం కమిటీ గురించి అన్ని చర్చిం చడం జరిగిందన్నారు. నందికొట్కూరు శ్రీశ్రీ చౌడేశ్వరీదేవి ఆలయఅభివృద్ధికి మేమున్ని విధాలకృషి చేస్తున్నామని,గతంలో ఎన్నడులేనివిధంగా జ్యోతులమహోత్సవం సంధర్భంగా అనేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించామని, కుల పెద్దల సహాకారంతో అమ్మవారి ఆలయాన్ని అన్ని విదాల అభివృద్ధి చేస్తామని వారు తెలిపారు.నాయకులు పూలసుబ్బయ్య,శ్రీనువాసులు పాల్గొన్నారు.

## ఘనంగా రాయప్రోలు సుబ్బారావు జయంతి వేడుకలు



**నందికొట్కూరు,మార్చి 17,ప్రబాతవార్త:** మండల పరిధిలోని అల్లూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భావ కవిత్వ ఆద్యుడు ప్రభోధ మార్గదర్శి రాయప్రోలు సుబ్బారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయిని హసీనాబి విద్యార్థులకు రాయప్రోలు సుబ్బారావు రచనల గురించి దేవభక్తి గేయాల గురించి విద్యార్థులకు వివరించి వారిచే ఏదేశ మేగిన ఎందుకాలిడిన ఏ పీఠమెక్కిన ఎవ్వరెదురైనా పొగడరా నీతల్లి భూమి భారతిని అంటు గేయం చిన్నారులు చక్కగా పాడి పలువురిని ఆకట్టుకున్నారు. చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపిటీసీ లక్ష్మి భర్త గణపతి మృతి



**పత్తికొండ,మార్చి 17,ప్రబాతవార్త:** పత్తికొండ ఎంపిటీసీ-3 కురువ లక్ష్మి భర్త మాజీ ఎంపిటీసీ కురువ గణపతి మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ భౌతికదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి గనంగా నివాళీలు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతు గణపతి మృతి వైసిపి కి తీరని లోటని, మంచి నాయకుడుని కోల్పోయామని, పార్టీ మృతుని కుటుంబానికి నిత్యం అండగా ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణ దాసు, ఉపాధ్యాక్షుడు కొత్తపల్లి బలరాముడు, మండల పార్టీ కన్వీనర్ కారం నాగగరాజు,, జూటూరు జయచంద్రారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళీలు అర్పించారు.

## అరికేరలో 18 గొర్రెలు మృతి..మరో 20 అస్వస్థత



**ఆలూరు,మార్చి 17,ప్రబాతవార్త:** ఆలూరు మండలం అరికేర గ్రామంలో గొర్రెల మృతి ఘటన రైతు కుటుంబాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. గ్రామానికి చెందిన ఎర్రమల్లయ్యగారి నాగప్ప కుమారుడు కారప్పకు చెందిన గొర్రెల మందలో ఆకస్మికంగా వ్యాది వ్యాఉపించడంతో 18 గొర్రెలు మృతి చెందాయి. మరో 20 గొర్రెలు అస్వస్థతకు గురి అయ్యాయని కారప్ప తెలిపారు. గొర్రెలు ఒక్కసారిగా బలహీనంగా మారి కూలిపోవడంతో వెంటనే చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే 18 గొర్రెలు మృతి చెందాయని తెలిపారు. ప్రస్తుతం 20 గొర్రెల వ్యాధికి గురి కావడంతో రైతు పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారింది. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.3 లక్షలు వరకు ఉండవచ్చని వారు తెలిపారు. గొర్రెల పెంపకమే ప్రదాన జీవనాదారంగా ఉన్న కారప్పను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## రంజాన్ పండుగ కేవలం ఆచారం మాత్రమే కాకుండా సేవాభావానికి ప్రతీక



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధిః** రంజాన్ పండుగ అనేది కేవలం ఆచారం మాత్రమే కాకుండా సేవాభావానికి ప్రతీక అని శిల్పా చారిటీస్ చైర్మన్ నాగిని రవిసింగారెడ్డి అనా న్నరు. మంగళవారం నంద్యాలలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ ఆధ్వర్యంలో భారీస్థాయిలో 3,000 వేల కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శిల్పా చారిటీస్ చైర్మన్ నాగిని రవిసింగారెడ్డి మాట్లాడుతూ ప్రతికుటుంబానికి నిత్యావసర సరుకులు, పండుగకు అవసరమైన సామాగ్రి ఇవ్వడంతో పేదల ఇళ్ళల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. పేదలతో పండుగ ఆనందాన్ని పంచుకోవడం తమ ధ్యేయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ప్రతి సంవత్సరం మరింత విస్తృతంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమాజంలో ఐక్యత, సహకారం పెంపొందించడంలో ఈకార్యక్రమాలు కీలకమన్నారు. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు శిల్పా చారిటీస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ



**పాములపాడు, మార్చి 17, ప్రభాతవార్త ః** పాములపాడు ఎంపీడివో కార్యాలయం నందు ఎంపిటీసిలకు, వార్డు మెంబర్లకు ఆర్‌జిఎస్‌ఏ మండస్థాయి శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఎంపీడివో చంద్రశేఖర్, డిప్యూటి ఎంపీడివోలు సులోచనలు తెలిపారు. సుస్థిర అభివృద్ధిపై గ్రామాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సరోజి వర్జీనియా పాల్గొన్నారు.

## పులికనుమ చెరువులో చేపల పెంపకంపై మరోసారి బహిరంగ వేలం..

**కోసిగి, మార్చి 17, ప్రభాతవార్త :** కోసిగి సమీపంలో నిర్మించిన పులికనుమ రిజర్వాయర్ చెరువులో చేపల పెంపకంకు సంబందించి వేలం పాటను బహిరంగంగా నిర్వ హిస్తున్నట్లు మత్స్యశాఖ రీజినల్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు తెలిపారు..ఈ మేరకు ఆయన వేలం నోటీసును మరోసారి విడుదల చేసారు. కోసిగి పరిధిలోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నందు మత్స్య సంపదను 1435 ఫసలి కింద వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు..కాగా ఈ వేలంకు సంబందించి ఈ సంవత్సరం జనవరి నెలలో బహిరంగ వేలం వేసేందుకు సిద్దం కాగా అప్పట్లో ఎవరు కూడా ముందుకు రాలేక పోయారు..దీంతో ఈ వేలంను జనవరి 31కు వాయిదా వేసారు..ఈ సమయంలో కూడా వేలం పాటాదారులు ముందుకు రాలేక పోవడంతో ఈ చేపల వేలం పాటను వాయిదా వేసి చేతులు దులుపుకునా న్నరు.. అప్పటి నుండి ఇప్పటి వరకు మత్స్యశాఖలో ఎలాంటి చలనం లేకపోలేదు..కాగా పులికనుమలోని చేపలు అన్యాక్రాంతం అవుతున్నట్లు గ్రహించిన మత స్యశాఖ దీనికి సంబందించి మరోసారి వేలం పాటను వేసేందుకు ముందుకు వచ్చింది.. దీంతో ఈ వేలం పాటను మత్స్యశాఖ అధికారులే వేస్తున్నారు. కాగా ఈ వేలం పాటలో పాల్గొనే పోటీదారులు ఈ నెల మార్చి 24వ తేది ఉదయం 11 గంటలకు కోసిగి ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో హాజరు కావాల్సిందిగా కోరారు.. ఈ వేలం పాటలో పాల్గొనే పోటీదారులు వారి ఆధార్ కార్డుతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు రూ.15 వేలను చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు..కాగా ధరావత్తు(డిపాజిట్) కింద కట్టిన రూ.15 వేలు తిరిగి పోటీదారుడికి ఇవ్వబడుదన్నారు..ఈ వేలం పాటలో అధికంగా పాడిన లీజుదారుడికే ఈ చేపల పెంపకం అనుమతి ఇవ్వబడునన్నారు..ఒక వేళ ప్రభుత్వం నిర్ణయించిన వేలం రుసుం రాకపోతే ఆ వేలంను రద్దు చేయబడునన్నారు..ముఖ్యంగా ఈ వేలం పాటను దక్కించుకున్న లీజ్‌దారుడు చెరువులోని మత్స్య సంపదను తప్ప నీటిని వినియోగించుకోరాదని, పెంచిన చేపలను పట్టే సమయంలో తూముల నుండి గానీ కట్టకు గండ్లు పెట్టి గానీ నీరు తొలగించి చేపలను పట్టరాదనే నిబంధనను ఉల్లంఘించరాదన్నారు..కావున ఈ నెల 24వ తేది మంగళవారం బహిరంగ వేలం నందు ప్రజలు షరత్తులకు లోబడి ఎవరైనను పాల్గొనవచ్చని తెలిపారు..మరి ఈసారైనా ఈ వేలం సజావుగా జరుగుతుందో లేదోనని ప్రజలు, గ్రామస్తులు చర్చించుకోవడం పరిపాటైంది..

## పంచాయతీ అభివృద్ధిప్రణాళికపై స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ



**పగిడ్యాల, మార్చి 17, ప్రభాతవార్త :** సుస్థిర అభివృద్ధిలక్షాలు సాదించేందుకు ఎంపిటిసిలకు, వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ అబ్బుర్ రహీంలు ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపాటానికి పూలమాలువేసి నివాళ్ళుఅర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంపచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి మండలంలోని ఆయా గ్రామపంచాయతీలలో పేదరికంలేనిగ్రామం, బాల్యవివాహాలులేన ఆరోగ్యకమరైన, స్వచ్చమౌన పచ్చదనం, స్వయం సంబృద్ధి రవాణసౌకర్యం సమన్యాయం , సుపరిపాలనా గ్రామంగా ప్రణాళిలను రూపొందించుకుని అన్ని అంశాలు అమలు చేస్తే సమాజంలో ఉన్న అందరికి సమన్యాయం జరుగుతుందనీ ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ అబ్బుర్ రహీం తెలిపారు. 9అంశాకలై వారు శిక్షకులు సంకిరేణిపల్లె పంచాయతీ కార్యదర్శి గురుతరుణ్, గణపురం పంచాయతీ కార్యదర్శి అనిల్ ఎంపిటిపిలకు వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎస్ డబ్ల్యూ మన్సూర్, ఎంపిటిసిలు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## గడ్డిమందు తాగి వ్యక్తి మృతి



**పాములపాడు, మార్చి 17, ప్రభాతవార్తః** పాములపాడు గ్రామానికి చెందిన బోయ అమర్ (28) అనే వ్యక్తి గడ్డి మందు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాములపాడు గ్రామానికి చెందిన బోయ అమర్ మద్యానికి బానిసై కుటుంబానికి పట్టించుకోకపోవడంపై ఈనెల 14న రాత్రి భార్య మందలించడం పట్ల అమర్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక 16న మధ్యాహ్నం మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు.

## శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే కన్నడ భక్తులకు సేవా



**ఆత్మకూరు, మార్చి 17, ప్రభాతవార్త :** శ్రీశైలంలో జరిగే ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా కర్ణాటక మహారాష్ట్రకు చెందిన కన్నడ భక్తులు ఆత్మకూరు మండల పరిధిలోని నల్లమల్ల అడవి మార్గం మీద పాదయాత్రగా వేల సంఖ్యలో తరలి వెళుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులకు సేవా కార్యక్రమం చేపట్టేందుకు అనంతపురం జిల్లాకు చెందిన దేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో కేవలం రెండు రోజుల్లోనే సుమారు 27 వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యుడు దేవర నరేష్ తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దేవా ట్రస్టు సభ్యుడు దేవర సురేష్ మాట్లాడుతూ, దాతల సహకారంతో దేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో తొలిసారిగా అటవీశాఖ అధికారుల అనుమతితో ఈ సేవ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వచ్చిన ఆలోచనతో, అవసరమైన అనుమతులు పొందుతూ తక్షణమే మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత ప్రణాళికాబద్ధంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా సాంప్రదాయంగా వచ్చే పండుగలను దృష్టిలో ఉంచుకొని పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే ఉగాది మరియు మహాశివరాత్రి సందర్భంగా ఇంకా ఎక్కువ సంఖ్యలో భక్తులకు సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. వేసవి కాలంలో తక్కువ సమయంలోనే ఈ సేవ కార్యక్రమం నిర్వహించడానికి సహకరించిన అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర నరేష్, భరత్, నాగరాజు, ప్రభాకర్, నరసింహ, లక్మన్,చెంచు బయన్న, పాల్గొన్నారు.

## ఆత్మకూరు పురపాలక సంఘంలో..

**: పాలకవర్గ కమిటీ సభ్యులకు ఘన సన్మానం : ముగిసిన వార్డు కౌన్సిలర్ల పదవి కాలం**



**ఆత్మకూరు, మార్చి 17, ప్రభాతవార్త :** నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ కమిటీ సభ్యుల వీడ్కోలు సభ నిర్వహించడం జరిగింది. కమిటీ సభ్యులు పాలకవర్గం చివరి రోజు కావడంతో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ ఓబులేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సన్మాన గ్రహీతలను మున్సిపల్ చైర్పర్సన్ మారుఫ్ ఆసియా సన్మానించి షీల్డ్ మెమొరండం అందించారు. అనంతరం చైర్ పర్సన్ మూల రాజగోపాల్ తోపాటు వార్డు కౌన్సిలర్లు పదవి కాలం ముగించడంతో గౌరవంగా సన్మాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు పురపాలక సంఘం కమిటీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి 22 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడం చాలా సంతోషకరంగా ఉందని, పట్టణ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు అందరూ సహకరించడం ద్వారానే ఆత్మకూరు పట్టణ అభివృద్ధి జరిగిందని అన్నారు. అనంతరం కౌన్సిలింగ్ సభ్యులు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి తోడ్పడడం సంతోషకరంగా ఉందని కౌన్సిల్ సభ్యులతో కలిసి మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ కార్మికులు అహర్నిశలు కృషి చేశారని ఆనందం వ్యక్తం చేశారు. కో ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, తిరుపతయ్య, వార్డు కౌన్సిలర్ లు రంగస్వామి, సుగుణమ్మ బోయ పార్వతి బోయ లక్ష్మీదేవి పాణ్యం పార్వతి,గౌస్ లాజం, మారుబోతుల విజయ్, మిట్ట కందల మహాబతుల, ప్రకాష్ రావు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ ను పరామర్శించిన వెల్దుర్తి ఎస్సై నరేష్



**వెల్దుర్తి, మార్చి 17, ప్రభాతవార్త :** వెల్దుర్తి హైవేపై అమెజాన్ ఎదుట కొన్నిరోజుల గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీ కొన్న ప్రమాదంలో ఆటోలో కుటుంబ సుభ్యులతో వస్తున్న వెల్దుర్తి మండలం వార్త విలేకరి అమీర్ కు తీవ్రగాయాలు అయిన విషయం తెలిసిందే.ఈ విషయం తెలుసుకున్న వెల్దుర్తి ఎస్సై నరేష్ మంగళవారం అమీర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎస్సై వెంట పాత్రికేయులు తాజ్ బాబా, నజీర్, సిబ్బంది షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## మోసం..మోసం..మరో.. ఘరానా మోసం..!

**(మొదటి పేజీ తరువాయి ) :** చేసుకున్న డబ్బులను ఆ సంస్థలో జమ చేశారు. తమ పెట్టుబడికి రెండింతలు డబ్బు వస్తుందని ఆశ పడ్డారు. ఏళ్ళు గడిస్తున్నా తమ ఆశలు అడియాసలయ్యాయన్న నిజం ఆలస్యంగా వెలుగు చూసింది. బాదితులు లబో దిబో మంటూ కన్నీళ్ళు కారుస్తున్నారు.తమ ఆశల సౌధం కూలి పోయిందని దిగాలు చెందుతున్నారు. కర్నూలు నగరంలోని బిర్లాగేట్ లోని ఓ కాంప్లెక్స్ లో ఈ సంస్థ కార్యాలయాన్ని శ్రేయా ఇన్ఫ్రా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమంత కుమార్ రాయ్ ప్రారంభించారు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభం కావటంతో ప్రజలు నమ్మారు. ఆ సంస్థ ఇచ్చి నవాగ్దానం ప్రకారం 2024 వరకు లబ్ధిదారులకు ఒక్కపైసా చెల్లించక పోవటంతో అనుమానాలు వచ్చాయి. ఇన్వెస్టర్లు అనుమానంతో పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటి వరకు సి.ఐ.డి విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. వేలకోట్ల రూపాయల కుంబకోణం వెలుగు చూస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోనీ కర్నూలు రాయలసీమ జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్ర పలు జిల్లాల్లోనూ, తెలంగాణా, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, హింమాచల్ ప్రదేశ్, హరియన, ఆసాం, బీహార్ తదితర రాష్ట్రాల్లోనూ దేశ వ్యాపితంగా వేలాది కోట్ల రూపాయలు దోపిడీ చేసి బోర్డు తిప్పేసి నట్లు తెలుస్తోంది.మొదట ఒక లక్ష రూపాయలు పెడితే నెలకు 12 వేలు చోప్పున 18 నెలలు ఇస్తామనీ నమ్మించారు. పెట్టుబడి కంటే రెట్టింపు ఆదాయం వస్తుందని అమాయకులు నమ్మారు. ఆ సంస్థ ప్రవేశపెట్టిన వివిధ పథకాలకు ఆకర్షితులయ్యారు. పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెట్టుబడి పెట్టారు. వేలాది లక్షలాది మంది పెట్టుబడి పెట్టి మోసపోయారు. దేశవ్యాపితంగ కోట్లాది మంది వేల కోట్లు పెట్టుబడులు పెట్టి దగాకు గురయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు పట్టణ పరి సర గ్రామాల్లోని వారు అనేకమంది మోసపోయి దిగాలు పడుతున్నారు.. మాజీ సైనికులు సైతం మోసపోవటం గమనార్హం. వీరే కాదు కూలీ నాలీ చేసుకునేవారు, పేద,మధ్య తరగతి వారి కాక ఉన్నతవర్గాల వారు కూడ మోసపోయినట్లు తెలుస్తోంది. ఒక్క కర్నూలు జిల్లాలోనే వందల కోట్లు మోసం చేసినట్లు తెలుస్తోంది. సి. ఐ.డి. విచారణలో బాదితులకు న్యాయం జరుగుతుందా ? లేక అగ్రిగోల్డ్ తరహాలోనే శ్రేయా ఇన్ఫ్రా మిగలనుందా అనే ప్రశ్న బాధితులను వేధిస్తుంది. వేచిచూద్దాం...

## రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని సిఎంకు వినతి

**– ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**



**ఆళ్లగడ్డ, మార్చి 17, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని కెసి కెనాల్ ఆయకట్టు రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డిలు మంగళవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. రానున్న వేసవి కాలంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయాలని సిఎం చంద్రబాబును కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు.

## మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడి రాజీనామా తిరస్కరన



**కర్నూలు హాస్పిటల్, మార్చి 17, ప్రభాతవార్త :** ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల శాఖ గౌరవ అధ్యక్షులు జి.అబ్రహం సమర్పించిన రాజీనామాను ఆమోదించడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప వెల్లడించారు. మంగళవారం ఎన్.బాలస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో అబ్రహం జనవరి 14న రాజీనామా చేయగా, యూనియన్‌కు ఆయన సేవలు అత్యవసరమని భావించి దానిని తిరస్కరిస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. ఆయన గౌరవ అధ్యక్షులుగా యధావిధిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రిలో ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, నాలుగో తరగతి ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని, తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని యూనియన్ నాయకులు ఎన్.బాలస్వామి నాయక్, ఖాజా మోహిద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిశ్చంద్ర నాయుడు, శేషిరెడ్డి, సుశీలమ్మ, రమేష్, గీతాకళ్యాణి, సుందర్ రాజు, రామేశ్వరమ్మ, లక్ష్మీకాంత్, మంగమ్మ పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోండి..



**అవుకు, మార్చి 17, ప్రభాతవార్త:** పాడి రైతులు గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిని భారతి దేవి అన్నారు. అవుకు పట్టణంలో తెదేపా మండల క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ నాయక్ తో కలిసి మంగళవారం గాలికుంటు నివారణ టీకా కార్యక్రమం ప్రారంభించారు. పశువైద్యాధికారిని మాట్లాడుతూ పశువులకు సోకే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధిని అరికట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను అందిస్తున్నదని తెలిపారు. గాలికొంటూ వ్యాధి సోకడం వల్ల పశువుల్లో ఉత్పాదకత తగ్గి రైతుకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. కావున పాడిపశులకు రైతులు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించి, ఆర్థిక నష్టాలు రాకుండా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. ఎల్ ఎస్ ఎ రాజేష్, ఏహెచ్ఎలు మహేంద్ర , ఓబులేసు, పశుమిత్ర రవి, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఉండుట్లలో రైతన్నా మీకోసం కార్యక్రమం



**గడివేముల, మార్చి 17, ప్రభాతవార్త;** మండలంలోని ఉండుట్ల గ్రామంలో మంగళవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంపై డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు మంచాలకట్ట శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పంట దిలీప్ కుమార్‌రెడ్డిలు చేపట్టారు. రైతుల ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు అందాయా లేదానని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటకి వెళ్లి రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వారు తెలిపారు. రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ పంట దిలీప్‌కుమార్‌రెడ్డి, దేశం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలి

**హొళగుంద, మార్చి 17, ప్రభాతవార్త;** గ్రామంలోని ప్రతిఒక్కరూ సకాలంలో ఇంటి కుళాయి తదితర పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఒక్కరూ పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామంలో పైపులైన్, డ్రైనేజీ సమస్య, వీధిలైట్ల సమస్య తదితర సమస్యలు ఏవైనా ఉంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిని ప్రతిఒక్కరూ పొదుపుగా వాడుకోవాలంతప్ప, అశోక్, వీరేష్, స్వాతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరీ జ్యోతులకు రాంకో రూ.60 వేలు ఆర్థికసాయం



**కొలిమిగుండ్ల, మార్చి 17, ప్రభాతవార్తః** మండల పరిధిలోని కోటపాడు గ్రామ టీడీపీ నాయకులు, హనుమంతగుండం సింగిల్‌విండో అధ్యక్షులు శివారెడ్డి, గ్రామపెద్దలు కోటపాడులో ప్రతియేటా ఉగాది, మహాలయపౌర్ణమి సందర్భంగా అనవాయితీగా జరుగుతున్న శ్రీచౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవకార్యక్రమానికి అవసరమైన ఆర్థికసాయం కోసం గ్రామపెద్దలు రాంకో సిమెంటు యజమాన్యంను కలిసి విన్నవించగా రాంకో యాజమాన్య అధికారులు స్పందించి జ్యోతి మహోత స్వవ ఖర్చులకు రూ.60 వేలు నగదును గ్రామపెద్దలకు అందజేశారు. రాంకో యూనిట్ హెడ్, జనరల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలి



**కొత్తపల్లి, మార్చి 17, ప్రభాతవార్తః** పశుపోషకులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యులు డా.అశోక్‌కుమార్ రైతులకు తెలిపారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని బావపురం గ్రామంలో గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఏప్రిల్ 29 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నాలుగునెలల పైబడిన గెదెలకు, ఆవులకు, ఎద్దులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. మంగళవారం బావపురం గ్రామంలో 130 పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశామన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. పశువులకు సోకే ప్రమాదకరమైన వ్యాధులు గాలికుంటు ఒకటి అన్నారు. ఈవ్యాధి నివారించడానికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని రైతులకు తెలిపారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నీటిని సంరక్షించి రాయలసీమ సాగు తాగు నీటిహక్కులను కాపాడండి

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి :** శ్రీశైలం ప్రాజెక్టు జల నిర్వహణపై ప్రభుత్వంతోణ చర్యలు తీసుకోవాలని కోరుతూ నంద్యాల కలెక్టరు రాజకుమారిని రాయలసీమ సాగు నీటి సాదన సమితి అధ్యక్షులు బొజ్జదశరథరామిరెడ్డి వినతి పత్రము ఇచ్చారు. మంగళవారము రాయలసీమ సాగు నీటిసాదన సమితి అధ్యక్షులు బొజ్జ దవరథరామిరెడ్డి జిల్లా కలెక్టరును కలిసి వినతి పత్రము ఇచ్చారు. ఈసందర్భవముగా అయన మాట్లాడుతూ రాయలసీమ సాగు నీరుతాగు నీరు గురించి కలెక్టరుతో మాట్లాడుతూ కెసి కెనాల్ కు సంబందించి అమల్లో ఉన్న ప్రభుత్వం ఉత్తర్వులు బచావత్ ట్రిబ్యునల్ నిబందనలు మరియు రాష్ట్ర విభజన చట్టంలోని విదానాలను వివరిస్తూ వాటిని పరిగనోనికి తీసుకుని నీటి విడుదలపై తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.సాగు నీటి సలమా మండలి సామావేశానికి ముందుగనే రైతులు విస్తృలత ఁగా రబీ పంటలు సాగు చేసిన నేపద్యములో కెసి కెనాల్ అయకట్టుకు ముచ్చుమర్రి



మరియు మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా తక్షణమే వీటిని విడుదల చేసి పంటలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. అదే విదముగా కుందూ నది పరివాహక ప్రాంతంలో నంద్యాల అలగనూరు కాలువ ద్వారా నీటి కోసం అలగనూరు కాలువ ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. ఈ సంవత్సరము శ్రీశైలం రిజర్వాయరుకు సమృద్ధిగా నీటి ప్రవాహంవచ్చిన నేపత్యములో ప్రాజెక్టు నింబందనల ప్రకారము 854 అడుగుల కనీస నీటి మట్టం కంటే దిగువకు నీటిని విడుదల చేయకుండా విద్యుత్ఉత్పత్తిని తక్షణమే నలిపివేసి నీటిన నల్వ ఉంచాలని కోరారు. రాబోవు సంవత్సరములో వర్షాబావ పరిస్థితులు నెలకొనే అవకాశమొన్నందున ముందస్తు జాగ్రత్తగా నీటిని సంరక్షించడము అత్యవసరమని తెలిపారు. త్రాగునీరు మరియు సాగు నీటికి ప్రథమ ప్రాదాన్యత ఇవ్వడముతో పాటు రాయలసీమ ప్రాంత నీటి హక్కులను కాపాడుతూ భవిషత్తులో నీటి సంక్షోభము తలెత్తకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈవిషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాని కెసి కెనాల్‌కు మరెఠ తడవ నీటి విడుదల చేపడతామని ఈ సందర్భముగా కలెక్టరు రాజకుమారి హామీ ఇచ్చారని బొజ్జ చెప్పారు.

## మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి



**కోవెలకుంట్ల, మార్చి 17,ప్రభాతవార్త :** ముస్లీంల ఇమామ్,మౌజన్ ఇచ్చిన మాట ప్రకారము గౌరవ వేతము రాత్రికి రాత్రే రూ 45 వేల కోట్లు విడుదల చేశారని తెలుగు దేశం పార్టి జిల్లా అదికారప్రతినిధి యస్ఎ గఫూర్ అన్నారు. మంగళవారము కోవెలకుంట్లలో అయన విలేర్లతో మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి ఏది చెప్పి దానికి కట్టుబడి పని చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఆర్టిసిలో ఉచిత బస్సు సౌకర్యము కల్పిస్తానని చెప్పిన విదముగా చేశారని చెప్పారు. అలాగే రైతు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ 20 వేలు ఇస్తామని చెప్పిన ప్రకారము మొన్న మూడవ విడతతో దానిని పూర్తి చేశారని చెప్పారు అలాగే మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లుఏడాదికి మూడు అన్నారు ఇచ్చారు. అలాగే డియస్సి అన్నారు దానిని పూర్తి చేశారు అలాగే వచ్చే అడకమిక్ ఇయర్‌లో కూడ డిస్సి విడుదల చేయనాన్నరని చెప్పారు. ఇటీవల ముస్లీం ఇమామ్ మౌజన్‌లకు గౌరవ వేతము ఇస్తానని చెప్పారు అలాఏగ రంజాన్‌పండుగ లోగా ఇస్తానని చెప్పారు. రాఇక రాత్రే 6 నెలల గౌరవ వేతనము విడుదల చేశారని చెప్పారు. చెప్పారు. దీనితో ఒక్కొక్కరికి రూ 90000 వేల గౌరవ వేతనము అకౌంటులో జమ అవుతుందని చెప్పారు. అందు బాబు చెప్పితే అది తప్పక చేస్తారని స్పష్టము చేశారు.

## భూసార పరీక్షలు చేసి భూమి సారన్ని తెలుసుకోంది



**కలుగొట్ల(కోవెలకుంట్ల), మార్చి 17, ప్రభాతవార్త :** రైతన్నలు వైసవి భూసారా పరీక్షలు చేయించుకుని భూమి సారాన్ని తెలుసుకోవాలని కోవెలకుంట్ల వ్యవ సాయ సబ్‌డివిజన్‌సంచాలకులు సుదాకరు కోరారు. రైతన్నకోసం అనే కార్యక్రమంలో బాగంగ సోమవారము నుండి రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలను వ్యవసాయ శాఖ చేపట్టింది.ఇందులో బాగంగా కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఎడిఏ సుదాకరు అద్వర్యంలో అరుమండలాల్లో రైతన్నకోసం అనే కార్యక్రము నిర్వహిస్తున్నరు. ఇందులో బాగంగా మంగళవారము కోవెలకుంట్ల మండలంలోని కలుగొట్ల గ్రామంలో మీ కోసం కార్యక్రమం నిర్వహించారు,.ఈసందర్బము ఎడిఎ మాట్లాడుతూ రైతుల కోసం ఏర్పాటు చేసిన ఈకార్యక్రమాన్ని రైతులు సద్వినియోగము చేసుకుని వ్యవసాయ అదికారులు ఇచ్చే సూచనలు సలహాలు పాటించాలని చెప్పారు. గ్రామ నాయకుడు గడ్డంనాగార్జునరెడ్డి ఎఈ సుదాకరరెడ్డి రైతులు పాల్గొన్నారు.

## నంద్యాల వైద్యులు చేస్తున్న సేవలు దేశంలోనే అదర్శం



**నంద్యాల,మార్చి 17,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల వైద్యులు దివ్యాంగులకు చేస్తున్న సేవలు దేశంలోనే అదర్శమని రాష్ట్ర ఐయంఎ అధ్యక్షులు డాక్టరు బాలరాజు అన్నారు ఈ నెల 18 నుండి 21వరకుఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వరిలో జరుగనున్న 24వజాతీయ పారా (దివ్యాంగ) అథ్లెటిక్ చాంపియనఖన పోటీలకు షాట్పుఉటన విబాగములో ఎపి రాష్ట్రంలో విజేతగా నిలిచి రాష్ట్రంతరుపున పొల్గొనెందుకు ఎంపికైన నంద్యాలజిల్లా క్రీడాకారు గౌతమ్‌ను శాలువ కప్పి ఐయంఎ అధ్యక్షులు సత్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఐయంఎ ప్రదాన కార్యదర్శి సుబాస్‌చంద్రబోస్, ఐయంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు డాక్టరు పనిల్‌కుమారు డాక్టరు సునీల్‌కుమారు, రాష్ట్ర మాజీ ప్రదాన కార్యదర్శి డాక్టరుల్లు ఫనిదర్‌లు జ్ఞాపికతలో సత్కరించారు.ఈసందర్బముగ డాక్టరు రవికృష్ణ మాట్లాడుతూ గౌతమ్ జాతీయ స్థాయిలో కూడా విజేతగా నిలిచి రాష్ట్రానికి నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని అకాంక్షించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థిక భరోసా



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధిః** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి వారికి ఆర్థికభరోసాగా నిలుస్తుందని టీడీపీజిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. అపదసమయాల్లో అందించే మెడికల్ రీయింబర్స్‌మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్దిదారులకు ఆర్థికంగా అదుకునేందుకు సహాయ నిధిని నంద్యాల, గోస్పాడు మండలాల లబ్ది దారులకు గత నాలుగురోజుల కిందట మంత్రి చేతులమీదుగా అందుకోగా మిగిలిన 24 చెక్కులను టీడీపీ పార్టీకార్యాలయంలో ఎన్ఎండి ఫిరోజ్ లబ్దిదారులకు మంగళవారం అందజేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారాలోకేష్‌కు, మంత్రిఎన్ఎండి ఫరూక్‌లో పాటు ఎన్ఎండి ఫిరోజ్, ఫయాజ్‌లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల శ్రీరాములు, ఒంటెవెలగల భాస్కర్‌రెడ్డి, ఎం కృష్ణాపురం బాలీశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, యాళ్లూరు వెంకటరెడ్డి, గోస్పాడ్ విశ్వనాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు కృపాకర్, సుంకన్న, నెహ్రూనగర్ వేమారెడ్డి, షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) పాల్గొన్నారు.

## రాయలసీమ యూనివర్శిటిని మింగేస్తున్న అవినీతి బకాసురుడిపై చర్యలు తీసుకోవాలి



**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్తః** రాయలసీమ యూనివరి ్శటిలో అవినీతి బకాసురుడిగా మారి యూనివర్శిటిని మింగెస్తున్న అధికారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఏఐఎస్ఏ, పీడీఎస్‌యు, ఏఐఎస్ఎఫ్, ఆర్పీఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్శిటి ప్రధాన ద్వారం ముందు అవినీతి బకాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఏ కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యు రాష్ట్ర నాయకులు రమణ, ఆర్పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజులు మాట్లాడుతూ యూనివర్శిటిలో ఒక అధికారి బకాసురుడిగా మారి నిధులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఉన్నతాధికారులు దున్నపోతుమీద వానపడినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించారు. ఒకవైపు యూనివర్శిటి భూములపై అక్రమ అక్రమణలు రోజు రోజుకు పెరుగుతున్నాయని మరోవైపు యూనివర్శిటి నిధులు దుర్వినియోగం అవుతున్నా అధికారులు స్పందించకపోవడం పట్ల అగ్రహం వ్యక్తం చేశారు. ఈ అవినీతి భాగోతాన్ని ఇక్కడితో వదలిపెట్టబోమని త్వరలో ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి పరిస్థితిని వివరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్శిటి నాయకులు దినేష్, రాము, తేజ, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దాం



**మంత్రాలయం, మార్చి 17, ప్రభావతార్త;** ఈనెల 28,29, 30వ తేదీల్లో జరిగే కర్నూలు జిల్లా ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల సెక్రటరీ మస్తాన్, సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, లక్ష్మణ్‌నాయక్, రైతు సంఘం నాయకులు గాబ్రేయిల్ పిలుపు నిచ్చారు.మంగళవారం మంత్రాలయంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ గోడ పత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం పర్మినెంట్ చేయకుండా కాంట్రాక్టు పద్ధతుల్లోనే కొనసాగించాలని చూస్తోందన్నారు. ఏళ్ల తరబడి కార్మికులు పరిశ్రమల్లో పని చేస్తున్నప్పటికీ ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి పథకాలకు కార్మికులు నోచుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ఈనెల 28 నుంచి చేపట్టే మహాసభల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని చర్చించడం జరుగుతుందన్నారు. కార్మికుల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు రాజు, నాయకులు భాస్కర్‌యాదవ్, నర్సి రెడ్డి, భీరప్ప, గోపాల్, నాగప్ప, శివ, రాజు పాల్గొన్నారు.

## చిన్నతుంబలంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**పెద్దకడుబూరు, మార్చ్ 17, ప్రభాతవార్త :** టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి మండల సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న ఆదేశాల మేరకు ఎమ్మినూరు విజన్ హాస్పిటల్ వారి సహకారంతో మండల పరిధిలో చిన్న తుంబలం గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యులు డాక్టర్ అనూష కంటి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు కొంతమందిని ఆపరేషన్ కొరకు కర్నూలు కు రెఫర్ చేశారు ఉచిత వైద్యం శిబిరం నిర్వహించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ జి మల్లికార్జున సొసైటీ చైర్మన్ కందనాతి నరసప్పలు మాట్లాడుతూ సేవా భావంతో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరికొన్ని గ్రామాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల వారు నిర్వహిస్తే తమ వంతు సహకారం అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి క్రీడలు కీలకం



**బనగానపల్లె, మార్చి 17, ప్రభాతవార్త :** మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీ జేకేఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన సదస్సును కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం అధ్యక్షుడు జె.ఎస్.ఎస్. బ్రహ్మానంద చారి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమం ప్రారంభంలో డీపీపీ పాఠశాల హెడ్‌మాస్టర్ నాగేంద్ర ప్రసాద్ క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉర్దూ పాఠశాల హెడ్‌మాస్టర్ అలియా ఖతీన్ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పలు సదుపాయాలపై అవగాహన కల్పించారు. తరువాత క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం సజావుగా సాగి విద్యార్థుల్లో ఉత్సవాన్ని నింపిందని అన్నారు. ఉపాధ్యాయులు నాగేంద్రుడు, పుష్పరాజు, ఎన్. కోబరావు పాల్గొన్నారు..

## చేపల వేలం వాయిదా



**హాలహర్వి, మార్చి 17, ప్రభాతవార్త;** మండలంలోని కామినహాల్ గ్రామంలో చెరువులో చేపల వేలం మంగళవారం వాయిదా పడింది. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ రామాంజనేయులు మాట్లాడుతూ కామినహాల్ చెరువు కింద దాదాపు 150 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని తెలిపారు. చేపల వేలం నిర్వహిస్తే చేపలు మత్స్యకారులు నీరు బయటకు మళ్లిస్తారని, దీంతో పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఉండంతో పంటలు చేతికి వచ్చిన తర్వాత వేలం నిర్వహించాలని రైతులు కోరడంతో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వేలం వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సర్పంచ్ పద్మా, సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసు, గ్రామపెద్దలు జనార్ధన్‌నాయుడు, జగన్ పాల్గొన్నారు.

## నేడే సామాజిక తనిఖీ బహిరంగసభ

**క్రిష్ణగిరి, మార్చి 17, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యలయం ఆవరణంలో 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ బుధవారం జరుగునని ఉపాది ఏ.పి.ఓ నాగసులోచన తెలిపారు.ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ 16గ్రామపంచాయితీల్లో 1.4.2025నుండి 31.3.25 జరిగిన పనులపై 9కోట్ల 39లక్షలు మెటీరియల్ 1కోటి 74లక్షలు జరిగిన పనులపై సామాజిక తనిఖీ సభ్యులు గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించారు.దీనిలో జరిగిన అ వవతవకలు జరిగిన అవినీతిపై బహిరంగ సభలో చదివి వినిపిస్తారు.ఉన్నాతాదికారుల సమక్షంలో జరుగునన్నారు.ఈ సమావేశంనకు పనులకు సంభందిత అధికారులు అందరు హాజరు కావలెనన్నారు.

## సలహాలతోనే అధిక దిగుబడులు



**హాలహర్వి, మార్చి 17, ప్రభాతవార్త;** వ్యవసాయ అధికారులు అందించే సలహాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జిలానీబాషా అన్నారు. మంగళవారం మండలంలోని బాపురం, గూళ్యం గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు ముందు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం కోల్పోతుందన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులనే వాడాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు అందిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు వెంకటలక్ష్మి, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడును తక్షణమే పదవి నుంచి తొలగించాలి



**కర్నూలు అర్బన్, మార్చి 17, ప్రభాతవార్త :** కామా నాయుడుని కాపాడుతున్న చంద్రబాబునాయుడు అంటూ ప్లాకార్డు లను ప్రదర్శించిన వైయస్సార్సీపి నాయకులు టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు అనైతిక వ్యవహారాలపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలపై దాడులు జరగడం తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్ఆర్సిపి నాయకులు పేర్కొన్నారు. కర్నూలుజిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీ.ఆర్. నాయుడు ఒక మహిళతో అనైతిక చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై టీడీపీకి చెందిన గూండాలతో దాడులు చేయించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు. అంతేకాకుండా, నిరసన తెలిపిన మహిళలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయడం మాత్రమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కర్నూలులోని ఎస్.వి కాంప్లెక్స్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు. టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడును తక్షణమే పదవి నుంచి తొలగించాలని, నిరసన తెలిపిన మహిళలపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

## రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు



**దేవనకొండ, మార్చి 17, ప్రభాతవార్త;** రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు అని టీడీపీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా టీడీపీ పార్టీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున రైతులతో కలిసి ప్రతి ఇ ంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు చేసిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తూ రైతులకు గోకులం షెడ్లు, డ్రిప్ ఇరిగేషన్, హార్టికల్చర్ రైతులకు ప్యాక్ హౌస్ సకాలంలో రైతులకు పెట్టుబడి సాయంలాంటి కార్యక్రమాలు చేస్తూ రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. వీఏఏ నాగన్న, టీడీపీ నాయకులు కురువ నాగరాజు, పెద్ద పాపన్న, మర్యాద రంగన్న, రవికుమార్, చాకలి లక్ష్మన్న, లింగన్న, కురువ శేఖర్, కురువ బడేసాబ్, బుర్రకుంట నాయుడు, ఎర్రమల, గ్రామ రైతులు రంగనాయకులు, రంగరాజు, కురువ ఉరుకుంద, సూరి, రంగన్న, శివన్న, సుకాలి, మల్లేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

## మున్సిపాల్టిలో మూగ బోచిన మైకులు



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టిలో మైకులు మూగబోయాయి. 2021నుండి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టిలో ప్రజా పాలన కొనసాగింది. అయితే దానితో అక్కడ వాదోపవాదాలకు నేటితో తెర పడినట్లు అయింది. జిల్లాలో నంద్యాల తో పాటు అత్మకూరు, డోన్, అళ్లగడ్డ, బేతంచెర్ల నందికొట్కూరులాంటి మున్సిపాల్టిలో ప్రజా పాలనకు తేరవేశారు నేటి నుండి ప్రత్యేక అదికారులు పాలనలో ప్రజలు సేవ చేయనున్నారు. అందులో బాగంగా నంద్యాల మున్సిపాల్టిలో చివరి సమావేషము మంగళవారము చైర్మన్ మాబున్నీసా అద్యక్షతన నిర్వహించారు. ఇందులో ఎలాంటి వాదోప వాదాలు జరుగ లేకు కాని ఒకరినొకరు కృజ్ఞతలు చెప్పుకున్నారు. అలాగే తము కౌన్సిల్ సభ్యులుగా చేసిన శిల్పాకుటుంబానికి వైసిపి కౌన్సిలర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థినిలకు హెచ్‌పివి వ్యాక్సిన్లు

**చాగలమర్రి, మార్చి 17, ప్రభాతవార్తః** స్థానిక చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ముత్యాలపాడు క్లస్టర్ వైద్యాధికారి డా.తస్లిమా సుల్తానా అధ్వర ్యంలో 14 సంవత ్సరాలు నిండిన అమ్మాయిలకు హెచ్‌పివి వ్యాక్సిన్లు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వారంకు క్యాన్సర్లు రాకుండా హ్యుమన్ ప్యాపిలోమా వైరస్ ద్వారా సైర్వేకల్ క్యాన్సర్ నివారించేందుకు ఈవ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి తలి ్లదండ్రులు 14 సంవత ్సరాలు నిండిన బాలికలకు ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడు ్యకేటర్ భారతి, హెల్త్ అసిస్ ్టంట్ మనోహర్, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా, అమ్మాయిలు, అమ్మాయిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు పగిడ్యాలకు ఎంఎల్ఏ గిత్త జయసూర్య రాక

**పగిడ్యాల, మార్చి17, ప్రభాతవార్త:** నందికొట్కూరు ఎంఎల్ఏ గిత్తజయసూర్య బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన పగిడ్యాలలో రైతన్నా – మీకోసం, అదేవిధంగా లన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరుతున్నట్లు టిడిపి నాయకులు మంగళవారం సాయంత్రం తెలిపారు. ప్రజలందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ టిడిపి మండల నాయకులు కోరారు.

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ బాలికలకు తప్పనిసరి



**దేవనకొండ, మార్చి 17, ప్రభాతవార్త;** 14 సంవత్సరాలు పూర్తి అయిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ తప్పనిసరి అని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రమైన దేవనకొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర డాక్టర్ రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ టీకా ప్రధానంగా 14 సంవత్సరాలు పూర్తయిన 15 సంవత్సరాలు పూర్తిగాని బాలికలకు వేయడం జరుగుతుందన్నారు. ఈ టీకా వేయడానికి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమ్మతి తప్పనిసరిగా తీసుకుంటారన్నారు. తీవ్రంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలికలకు పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే టీకా వేస్తారన్నారు. టీకా వేసుకున్న తర్వాత కనీసం 30 నిమిషాల పాటు ఆరోగ్య కేంద్రంలో ఉండాలన్నారు. టీకా వేసిన చోట నొప్పి, వాపు, ఎర్రదనం, స్వల్ప జ్వరం, తలనొప్పి, అలసట వంటి దుష్ప్రభావాలు కనిపించవచ్చన్నారు. ఇవి సాధారనంగా ఒకటి లేదా రెండు రోజుల్లో తగ్గిపోతాయని, ఈ టీకా తీసుకుంటే భవిష్యత్‌లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గించవచ్చన్నారు. వైద్యులు విజయభాస్కర్, కళ్యాణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నాయకులు శేఖర్ గుండెపోటుతో మృతి



**పగిడ్యాల, మార్చి 17,ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయ శేఖర్ (46) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు శేఖర్‌కు గుండె పోటు రావడంతో చికిత్సనిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మృతి చెందారని నిర్దారించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతి చెందిన సమాచారం తెలియడంతో ఎంఎల్ఏ గిత్త జయసూర్య హుటాహుటీన లక్ష్మాపురంలోని ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలువేసినివాళు ్ళఅర్పించారు. ఆయన మృతిపట్ల ఎంఎల్ఏ విచారం వ్యక్తం చేశారు. బోయ శేఖర్ భార్య రజిత, ఇద్దరు కూతుళ్లను ప్రమార్శించి న ఎంఎల్ఏ గిత్త జయసూర్య బోయ శేఖర్ మృతికి సంతాపంతోపాటు వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూతి తెలిపారు. మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి గోవిందు, టిడిపి నాయకులు మద్దిలేటిగౌడు, సర్వోత్తమరెడ్డి, భూషిగౌడు, డీలర్ అయ్యన్న, షాహిన్ భాష, జనసేన నాయకులు నాగేంద్రగౌడు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగల కింద గడ్డివాములు ఏర్పాటు చేసుకోవద్దు



**హొళగుంద, మార్చి 17, ప్రభాతవార్త;** విద్యుత్ తీగల కింద గడ్డివాములు ఏర్పాటు చేసుకోవద్దని హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ గురజాల సూచించారు. మంగళవారం ఎస్ఐ స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల కొరకు గడ్డివాములు విద్యుత్ తీగల కింద ఏర్పాటు ఏసుకోరాదని, ఈ ఏడాది వేసవి కాలంలో ఎండలు విపరీతంగా ఉండడంతో ఏదైనా ఎలక్ట్రికల్ వైర్ల రాపిడి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గడ్డివాములు తగలబడి రైతులు నష్టం చేకూరే అవకాశం ఉన్నందువల్ల మండలంలోని ప్రజలందరూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గడ్డివాములపైన ఎలాంటి కరెంట్ వైర్లు గానీ లేకుండా చూసుకోవాలన్నారు. గడ్డివాములు పైన తగిన కవర్లతో కప్పి కాపాడుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 101కి గానీ లేదా ఫైర్ కంట్రోల్ నంబర్ 9100108101కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

## వైసీపీ పార్టీని వీడి టీడీపీలోకి చేరిక



**గడివేముల, మార్చి 17, ప్రభాతవార్త;** మండలంలోని ఉండుట్ల గ్రామానికి చెందిన పలువురు మంగళవారనాడు వైసీపీ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పంట దిలీప్‌కుమార్‌రెడ్డిలు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దాదాపు 30 కుటుంబాలు వైసీపీ పార్టీని వీడి టీడీపీలోకి చేరాయని నాయకులు తెలిపారు. టీడీపీ పార్టీలో చేరిన వారిలో దోర్నాల రామ మద్దిలేటి, మారెళ్ల శ్రీరాములు, మారెళ్ల కిట్టు, బుగ్గాని పల్లె నాగేష్, దాసరి కిట్టు, పలువురు కుటుంబాల వారు ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు మన రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న తీరు చూసి టీడీపీలో ఏరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, గడివేముల మండల కన్వీనర్ పం దిలీప్‌కుమార్‌రెడ్డి, దేశం నారాయణరెడ్డి, రాజునాయక్, పంట రామకృష్ణారెడ్డి, రంగస్వామినాయక్, సుబ్బునాయక్ పాల్గొన్నారు.

## పాఠశాల హెచ్ఎంగా శేషాద్రి బాధ్యతల స్వీకరణ



**హొళగుంద, మార్చి 17, ప్రభాతవార్త;** మండలంఒని వందవాగిలి గ్రామంలోని జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న కె.నాగిరెడ్డి గత ఫిబ్రవరి 28న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు హెచ్.వై.శేషాద్రికి పాఠశాల హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ కడప వారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళశారం జిల్లా పరిషత్ కన్నడ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.జంబునాథ, బి.రమేష్, మాన్వి హనుమంతప్ప, అశోక్, వీరేష్, స్వాతి, ఉష పాల్గొన్నారు.

## వంటశాలకు రూ.40 వేలు విరాళం



**చాగలమర్రి, మార్చి 17, ప్రభాతవార్తః** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వంటశాల షెడ్ పూర్వపు విద్యార్థులు రూ.40 వేలు విరాళం అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం జీవయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో 1978-79 బ్యాచ్‌కు చెందిన లాయర్ ఎం మహబూబ్ బాషా, రిటైర్డు టీచర్ బద్రి వెంకటేశ్వర్లు, వాసవీ విద్యాసమాజం బోర్డు మెంబరు పుల్లారెడ్డిలు కలిసి రూ.40 వేలు అందరి సమక్షంలో ప్రధానోపాధ్యాయులు జీవయ్యకు అందజేశారు. అనంతరం విరాళం అందించిన ముగ్గురు పూర్వపు విద్యార్థులను శాలువలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువలతో సన్మానించారు. అలాగే అడ్వాంటా సీడ్ కంపెనీ వారు పాఠశాలకు, బీరువా, టెబుల్స్, కుర్చీలు రూ.30 వేల విలువ గల ఫర్నిచర్ డోనేట్ చేయడం జరిగింది. ఈసందర ్భంగా వారికి పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16,862 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులను భర్తీచేయాలి




**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్తః** రాష్ట ్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 16,862 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులను భర్తీచేయాలని మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ చేసింది. ఈసందర ్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు ఉశేన్ బాష, నాయకులు అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 16,862 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అసెంబ్లీ సాక్షిగా హోమంత్రి అనిత ప్రకటించారు. అదేవిధంగా 16862 పోస్టులకు ఉగాది రోజు విడుదల చేసే జాబ్ క్యాలెండర్ పొందుపరిచి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో లక్షల మంది నిరుద్యోగులు ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులపై ఆశలు పెట్టకొని ఖాళీగా ఉన్న 16862 పోస్టులు భర్తీచేస్తారని రాష్ట్ర ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని రెండు సంవత ్సరాల నుంచి మోసం చేశారు. కనీసం రాష్ట్రంలో ఖాళగా ఉన్న పోస్టులను ఉగాదిరోజు జాబ్ క్యాలెడర్ విడుదల చేసి భర్తీచేయాలని లేదంటే నిరుదో ్యగులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సర్టిఫికెట్లు పోయినవి**

యమ్మని శ్రీలత అనే నేను, 2-3-2026, తేదినాడు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని కురుకుంద గ్రామం నుండి ఆత్మకూరు కొత్త బస్టాండ్‌కు బైకు మీద కర్నూలు వెళ్లెందుకు ఆత్మకూరు బస్టాండ్‌కు వస్తుండగా మార్గం మధ్యలో పదవ తరగతి సర్టిఫికెట్లు పోయినాయి ఈ విషయంపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను ఎవరికైన సర్టిఫికెట్లు దొరికితే ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరని మనవి.

రోల్ నెంబర్: 0920325052 బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్: జూన్2009

సంప్రదించవలసిన అడ్రస్సు: యమ్మని శ్రీలత / నాగన్న, ఆత్మకూరు మండలం,కురుకుంద గ్రామం, నంద్యాల జిల్లా.
సెల్ నెంబర్: 6309323752, 7330771062

04 page 18_04 page 18.qxd 17-03-2026 PM 11:29 Page 1



# డోన్ పట్టణంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన



**డోన్ మార్చి 17 ప్రభాతవార్త :**
ఎమ్మెల్యే కోట్ల జై సూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం డోన్ పట్టణం లోని ఇంద్రనగర్ ప్రాంతాల్లో పర్యటించి వార్డు సమస్యలను అడిగి తెలుసుకున్నారు వార్డులలో రోడ్లో త్రాగునీరు కావాలని ప్రజలు ఆర్ దృష్టికి తీసుకొచ్చారు అదేవిధంగా విద్యుత్ వంటి సౌకర్యాలపై ప్రజలు వెల్లడించిన సమస్యలను పెద్దగా వినిపించుకొని వినిపించుకొని వాటి పరిష్కారం ప్రతిక్షనిసర్లు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు ప్రజల సంక్షేమ కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతి సమస్యను దశలకు వారుగా పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం ఇంద్రనగర్ చెందిన టిడిపి కార్యకర్త నోరు భాష రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున ఆర్థిక సహాయము అందించబడిందని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ పత్రాన్ని నూర్ భాషా కుటుంబానికి ఆయన చేతుల మీద అందజేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఒక 100 బీమా పథకం ద్వారా ఐదు లక్షలు వారి కుటుంబానికి అందజేయడం జరుగుతుందని కుటుంబానికి కొంతమేర ఊరట కలిగిస్తూ భవిష్యత్తులో ధైర్యంగా జీవించేందుకు తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు పార్టీ కార్యకర్తల సంక్షేమ తమకు అత్యంత ముఖ్యమని తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు తమ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుండాలు జయరాముడు కే ఈ శ్యామ్ లారీ భాష రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

**కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయయ్ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోట్ల :**



డోన్ పట్టణంలో ఉన్నటువంటి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యాలయం ను మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జై సూర్య ప్రకాష్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా భోజన వసతులు ఎలా ఉన్నాయి వాటిపైన సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు ప్రత్యేకంగా పిలిచి విచారించారు భోజనం యొక్క రుచి మరియు నాణ్యత పై లోపాలు ఉంటే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు విద్యార్థుల శ్రేయస్సు కోసమే అన్ని విధాల చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు వంటశాలలో భోజనాలను పరిశీలిస్తూ వంట చేసేవారికి సూచనలు ఇచ్చారు ఏమాత్రం నాణ్యత తక్కువ ఉన్న ఇబ్బందులు గురవుతారని సూచించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు

# పంచాయితీ రాజ్ శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధుల గైర్హాజరు

**: ఖాళీగా మారిన సమావేశ భవనం**
**బనగానపల్లె, మార్చి 17 ప్రభాతవార్త:**
జిల్లా పంచాయతీరాజ్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమానికి గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు హాజరుకాక పోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో నిర్వహించాల్సిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం 11 గంటలు దాటినప్పటికీ ఒక్క ప్రజాప్రతినిధి కూడా హాజరు కాలేదు. బనగానపల్లె మండల పరిధిలో మొత్తం 24 గ్రామపంచాయతీలు ఉండగా, 29 మంది ఎంపీటీసీలు, 260 మంది వార్డు సభ్యులు ఉన్నారు. వీరందరికీ గ్రామపంచాయతీల అభివృద్ధిపై సామర్థ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా పంచాయతీరాజ్ అభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ద్వారా శిక్షణ ఏర్పాట్లు చేపట్టారు. అయితే నిర్ణయించిన సమయానికి ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో శిక్షణ తరగతులు ప్రారంభం



కాలేకపోయాయి. సమావేశ భవనంలో ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, కార్యాలయ సూపరింటెండెంట్ హమీదు పంచాయతీ సెక్రటరీలు మాత్రమే ఉండగా, మిగిలిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఈ విషయంపై ఎంపీడీవో నాగరాజును వివరణ కోరగా, శిక్షణకు హాజరు కావాలని అన్ని గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించామని తెలిపారు. కొంతమంది వస్తున్నామని సమాచారం ఇచ్చినా, సమయానికి చేరుకోలేదని పేర్కొన్నారు.



# మంత్రి ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముస్లీం మైనార్టీ నాయకులు



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధిః**
నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన ముస్లీం మైనార్టీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను నంద్యాల వారి క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్దుల్ వాహబ్, అబ్దుల్ ఖాదర్, మౌలి బాష, చాంద్ బాష, అలీ బాబు, అబ్దుల్ ముదలిప్, షఫివుల్లా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రతపై అవగాహన.

**: ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్**



**కర్నూలు అర్బన్ మార్చి 17 ప్రభాతవార్త :**
కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ పర్యవేక్షణలో కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కర్నూల్ ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు మరియు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ కాపాడాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన అవగాహన వీడియోలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లకు, ఇతర వాహనదారులకు చూపించిన్నట్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్త ప్రతినిధిః**



పట్టణంలోని జుమ్మా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ముస్లీం సోదరులతో కలిసి నమాజ్ అచరించి రంజాన్ మాసం పవిత్రతను గుర్తుచేసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రేమ, సహనం, దానధర్మాల ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# వైసిపి సీనియర్ నాయకుడు దేశం సుదాకరరెడ్డిని పరామర్శించి శిల్పారవి



**నంద్యాల, మార్చి 17, ప్రభాతవార్తప్రతినిధి**
నంద్యాల మాజీ యంయల్ఎ శిల్పారవిచంద్రకిశోరురెడ్డి వైసిపి సీనియర్ నాయకుడు మాజీ మున్సిపల్ చైర్మన్ భర్త దేశం సుదాకరరెడ్డిని పరామర్శించారు. ఇటీవల దేశం సుదాకరరెడ్డి అయన స్వగ్రామమైన రూపనగుడి కి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదము జరిగింది. దీనితో అయనకు స్వల్ప గాయలు కావడముతో ఇంటి వద్ద ఉంటు రెస్టు తీసుకుంటున్నారు. ఈ విషం తెలిసిన మాజీ యంయల్ఎ శిల్పారవిచంద్రకిశోరురెడ్డి మంగళవారము మద్యహ్నాము నంద్యాల పట్టణంలోని యన్‌జిఒ కాలనీలో ఉన్న దేశం సుదాకరరెడ్డిఅయన సతీమని మున్సుపల్ మాజీ చైర్మన్ దేశంసులోచనను ఇంటికి వెళ్లి పరామర్శించారు.

# వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి

**: ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు**
**: ఎండ తీవ్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు**
**: నీటి కొరత, వడదెబ్బలు, అగ్నిప్రమాదాలపై ప్రత్యేక దృష్టి**
**కర్నూలు, మార్చి 17, ప్రభాతవార్త :**
జిల్లాలో కొనసాగుతున్న వేసవికాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత, వడదెబ్బలు, అగ్నిప్రమాదాలు వంటి సమస్యలు అధికమయ్యే అవకాశమున్నందున ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవికాలంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రధాన ప్రదేశాల్లో త్రాగునీరు, చలివేంద్రాలు, నీడ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, దేవాలయాలు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. వ్యవసాయ, నిర్మాణ, పారిశ్రామిక కార్మికులకు తగిన విశ్రాంతి, త్రాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఎండలో పని చేయకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, గ్రామాల్లో గడ్డి దిబ్బలు, పొలాలు, అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగకుండా చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. బావులు, చెరువులు, మైనింగ్ కుంటల వద్ద ప్రమాదాలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పిల్లలు ఆ ప్రదేశాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బలకు గురైన వారికి తక్షణ చికిత్స అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉండాలని, అంబులెన్స్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్య ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రధాన సూచనలు:ట్రాఫిక్ జంక్షన్ల వద్ద నీడ సదుపాయాలు ఏర్పాటు చేయాలి బస్టాండ్లు, షెల్టర్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి పాఠశాలలు, కాలేజీలలో త్రాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలి కార్మికులకు త్రాగునీరు,



మజ్జిగ, విశ్రాంతి వసతులు అందించాలి గ్రామ, వార్డు స్థాయిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి దేవాలయాల్లో భక్తులకు నీరు, నీడ సదుపాయాలు కల్పించాలి మధ్యాహ్నం 12–3 గంటల మధ్య ఎండలో పని చేయకుండా అవగాహన కల్పించాలిభద్రతా చర్యలు:అగ్నిమాపక కేంద్రాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి గడ్డి దిబ్బల వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి బావులు, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి అటవీ ప్రాంతాల్లో మంటలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలి ఆరోగ్య పరిరక్షణ చర్యలు:వడదెబ్బ బాధితులకు తక్షణ చికిత్స అందించాలి ముఖ్య ప్రదేశాల్లో ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలి ప్రజలు తెల్లని, సౌకర్యవంతమైన దుస్తులు ధరించడం, టోపీలు, గొడుగులు వినియోగించడం, తరచూ నీరు, మజ్జిగ సేవించడం ద్వారా ఎండ ప్రభావం నుంచి రక్షించుకోవాలని సూచించారు.

# నౌలేకల్ లో బుడ్డలు మిషన్‌లోకి పడి యువకుడు మృతి..!

**: పొలంలో బుడ్డల కట్టెనుమిషన్‌కు వేస్తుండగా ప్రమాదం..**

**పెద్దకడబూరు మార్చి17 ప్రభాతవార్త**



మండల పరిధిలో నౌలేకల్ గ్రామంలో బుడ్డల కట్టెను మిషన్ లోకి వేస్తుండగా ఆదోని మండలం దొడ్డనగిరి గ్రామానికి చెందిన వీరేంద్ర అనే యువకుడు ప్రమాదవశత్తు మరణించినట్లు ఎస్ఐ మారుతి మంగళవారం విలేకరులు తెలిపారు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు ఆయన తెలిపిన వివరాల మేరకు నలేకల్ గ్రామానికి చెందిన పుష్పరాజ్ పొలాన్ని బోయ చిన్న స్వామి సాగు చేసి వేరుశనగ పంట వేశారు వేరుశెనగ కట్టెను మిషన్ కు వేసేందుకు కూలి నిమిత్తము వెళ్లిన వీరేంద్ర వేరుశన కట్టెను మిషన్ లోకి వేస్తున్న క్రమంలో చేతి కట్టుకున్న టవల్ తో పాటు వ్యక్తిని మిషన్ లాగడంతో తీవ్ర గాయాలయ్యాయని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు అన్నారు మృతుడు వీరేంద్ర భార్య పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

# రంజాన్ తొఫా ను పంపిణీ చేసిన డాక్టర్. శంకర్ శర్మ..



**కర్నూలు సీటీ, మార్చి 17 ప్రభాతవార్త :**
కులమతాలకు అతీతంగా అన్ని పండుగలు సోదరభావంతో జరుపుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు నగరంలోని గురుదత్త పాలీక్లినిక్ లో పేద ముస్లింలకు డాక్టర్. శంకర్ శర్మ రంజాన్ తోఫా అందించారు. పేదలకు సహాయం చేయడం ఆనందంగా ఉందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ధనవంతులు పేదవారికి సహాయం చేయడం వల్ల మంచి జరుగుతుందన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండకాలంలో వృద్ధులు మంచినీళ్లు తరుచూ తీసుకోవాలని కోరారు.

# టీటీడీ చైర్మన్‌గా బిఆర్ నాయుడు అనర్హుడు



**కర్నూల్ అర్బన్ మార్చి 17 ప్రభాతవార్త :**
తిరుపతిలో వైఎస్సార్ సీపీ నాయకుల పై దాడి, అక్రమ అరెస్టును ఖండిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు ఇందిరమ్మ కట్ట వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ దగ్గర ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు ఓ మహిళలతో కామక్రీడలు నిర్వహిస్తే, దానిని తప్పని చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కాటసాని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు చేతకానితనంతోనే ఇప్పటికీ బీ.ఆర్. నాయుడు పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి వ్యక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి సేవలకు అనర్హుడని ఆయన విమర్శించారు. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం నేతలు డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు దొరికిపోయారని కూడా తెలిపారు. వెంటనే టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేసారుఈ కార్యక్రమంలో కల్లూరు మండల నాయకులు, కల్లూరు అర్బన్ పరిధిలోని వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసమే 'రైతన్నా..మీకోసం' : ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి

**– ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే సంపూర్ణ ఆరోగ్యం..**
**కడదొడ్డి(కోసిగి), మార్చి 17, ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా 'రైతన్నా..! మీ కోసం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ముఖ్యంగా సంపూర ్ణ ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సి ఉంటుందని మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి అన్నారు..రైతుల చెంతకే వెళ్లి సాగు కష్టాల గురించి తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన రైతన్నా..మీ కోసం కార్యక్రమంలో భాగంగామంగళవారం కోసిగి మండల పరిధిలోని కడదొడ్డి గ్రామంలో పర్యటించి రైతులతో చర్చించారు..మండల వ్యవసాయాదికారి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరెడ్డి రైతులతో మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో సంభవించే ఎల్‌నినో ప్రభావం వల్ల రుతుపవనాలు ఆలస్యం కావడం, వర్షపాతంలో కలిగే మార్పులు, హెచ్చు ఉష్ణోగ్రతలు, నీటి కొరత, పశుగ్రాసంపై ప్రభావం మొదలగువిషయాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.. రైతులు ప్రీ మాన్ సూన్‌డ్రై సోయింగ్ విధానం ద్వారా సుమారు 32 రకాల విత్తనాలను పంట పొలంలో తొలకరి వర్షాలకు



ముందుగా చల్లుకోవడం వల్ల భూసారం పెరగడమే కాకుండా, పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుందనే విషయాన్ని రైతులకు వివరించారు..ఇక వ్యవసాయంలో పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సహాయం అంశాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు..ప్రతి రైతు తమ సందేహాలను నివృత్తం చేసుకుని భూ సారానికి తగిన విధంగా వ్యవసాయాధికారుల సలహాల మేరకు పంటలను పండించుకోవాలని సూచించారు.. అనంతరం గ్రామంలో ప్రతి రైతు ఇంటింటికి తిరిగి రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలనుఅధికారులతో కలసి పంపిణీ చేసారు..ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ రాజాం, తహశీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రమేష్‌రెడ్డి, నాయకులు పలె ్లపాడు రామిరెడ్డి, ముత్తారెడ్డి, సొసైటి అధ్యక్షులు నాడిగేని అయ్యన్న, మాజీ జెడ్‌పిటీసి తోవి రామకృష్ణ, జ్ఞానేష్, అరివిల్లి వీరేష్, నియోజకవర్గ స్పెషల్ అధికారి రాజు, కురువ అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు..

# మహిళను లైంగిక వేధింపు కేసులో ముద్దాయికి ఒక్కసంవత్సర జైలుశిక్ష

**: 30 వేలు జరిమాన విధించిన ఆత్మకూరు న్యాయస్థానం**
**ఆత్మకూరు మార్చి 17 ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండల పరిధిలోని 27.08.2017 తేదీన మధ్యాహ్నం 12:30 గంటలకు ముద్దాయి కదిరి రమణ తండ్రి పెద్ద చెంచయ్య వయస్సు 42 సంవత్సరములు, ఫిర్యాది ఇంటి వద్దకు వచ్చి ఫిర్యాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో నమో చేసిన కేసు పై ఆత్మకూరు న్యాయస్థానంలో మంగళవారం మహిళను లైంగిక వేధించిన కేసులో ముద్దాయి కదిరి రమణకు ఒక సంవత్సరం జైలు శిక్ష 30 వేలు జరిమానా విధించిన న్యాయస్థానం తీర్పు మంగళవారం సంచలనంగా మారింది జిల్లా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఆ మహిళ భర్త కు 500 రూపాయలు ఇచ్చి మద్యం తీసుకోరామని చెప్పి ఇంటి నుండి బయటకు పంపినాడని, తర్వాత,



ముద్దాయి ఫిర్యాది తో మీ ఇల్లు కట్టుకోవడానికి అదనంగా ఒక లక్ష రూపాయలు ఇస్తామని, నీవు నాకు లొంగమని లైంగికంగా వేధించినాడని, నీవు నాకు లొంగకపోతే నీ భర్తను చంపేస్తాను అని బెదిరించినాడని, ఫిర్యాది రిపోర్టు ఇవ్వగా, అప్పటి హెడ్ కానిస్టేబుల్ యేసయ్య కేసు నమోదు చేసినాడని, తదుపరి విచారణ అప్పటి ఎస్సై శివ శంకర్ నాయక్ గారు సమగ్ర విచారణ జరిపి చార్జ్ షీట్ ఫైల్ చేసినారు సదరు కేసుపై నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఆత్మకూరు డీఎస్పీ, ర్ . రామంజి నాయక్, ఆధ్వర్యములో ఆత్మకూరు రూరల్ సీఐ, సురేష్ కుమార్ రెడ్డి కొత్తపల్లి. ఎస్ఐ , జయ శేఖర్ , కోర్టు కానిస్టేబుల్ ఏ .మల్లికార్జున సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచడం జరిగింది. కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ మైల బాబు రాజేంద్ర ప్రసాద్ ఏపీపీ తమ వాదనలు వినిపించగా ఆత్మకూరు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రాహుల్ అంబేద్కర్ విచారణ అనంతరం నేరం రుజువైనందున ముద్దాయికి ఒక్క సంవత్సన్నర కారాగార శిక్ష విధించి వాటితో పాటు రూ. 30,000/లు జరిమాన విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ కేసు నందు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టేందుకు కృషి చేసిన ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి కొత్తపల్లి ఎస్సై ఆర్ జయ శేఖర్ , కోర్టు కానిస్టేబుల్ ఏ .మల్లికార్జున ను ఉన్నతాధికారులు అభినందించరు

# తెలుగు యుగాది క్యాలెండర్‌ల అవిష్కరణ

**కర్నూలు విద్య, మార్చి 17, ప్రభాతవార్తః**
త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌లను శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోధానందయోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహం నందు మంగళవారం అవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన ఈజ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతిఒక్కరికి సరళమైన బాషలో అర్థమయ్యే విధంగా రూపొందించడం జరిగిందన్నారు. ప్రతిసమస్యకు పరిష్కారమార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి స్వామివారు రచించడం జరిగిందన్నారు. తెలుగు నెలలు అనుచరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదిలను పొందుపరిచి తయారుచేసిన ఇటువంటి గొప్ప కాలసూచిక అందించడం ప్రజలందరు హర్షించదగ్గ విషయమన్నారు.



కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రభోధ సేవాసమితి – ఇందూ జ్ఞానవేదిక కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షులు సభ్యులు నాగయ్య, పురుశోత్తమ్, కళ్యాన్, వాసు, సుధాకర్, మధువాణి, ప్రమీల, రాజేశ్వరీ, గంగాధర్, నాగ సుంకన్న, శేషు, ఈశ్వరయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ కీస్తుల వసూళ్లకు వేలం పాటలు

**ప్యాపిలి మార్చి17 ప్రభాతవార్త:**
ప్యాపిలి గ్రామ పంచాయతీకి సంబంధించి వారపు సంత మార్కెట్టు, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్, కబేలకు కేసుల వసూళ్ల హక్కుల కోసం మంగళవారం వేలంపాటలను నిర్వహించినట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి తెలిపారు. వేలంపాటలలో ఎనిమిది మంది పాటదారులు పాల్గొని వేలం పాటలను పాడారు. గొల్ల రామ్మోహన్ రూ.12,66,000 లకు వేలంపాట దక్కించు కున్నారు. గత సంవత్సరం 11లక్షల 48వేల రూపాయలకు దక్కించుకోగా, ఈ సంవత్సరం రూ.12,66,000లకు వేలంపాటలో దక్కించుకోవడంతో పంచాయతీకి పంచాయతీకి లక్ష 18 వేల రూపాయల ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో డోన్ డిడిఓ నరసింహ రెడ్డి, ప్యాపిలి డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, ఉపసర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, పంచాయతీ అభివృద్ధి అధికారి శివ కుమార్ గౌడ్, గ్రాపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# రంజాన్ పండుగకు పకడ్బంది ఏర్పాట్లు

**–నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్**
**కర్నూలు మున్సిపల్, మార్చి 17, ప్రభాతవార్తః**
రంజాన్ పండుగను పురస్కరించుకొని పకడ ్బంది ఏర్పాట్లు



చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ అదేశించారు. మంగళవారం బసా ్టండ్ సమీపంలోని పాత ఈద్గా, సంతోష్‌నగర్‌లోని ఈద్గాలను ఆయన పరిశీలించారు. స్వచ్ఛత పనులు, పెయింటింగ్, తాగునీటి సరఫరా వంటి కనీస సౌకర్యాలు పండుగ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నివిభాగాల సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్యాధికారి నాగప్రసాద్ బాబు, ఎంఈలు మనోహర్‌రెడ్డి, గిరిరాజ్, డీఈఈ నరేష్, ఏఈ షేక్షావలి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.